వడివడిగా వరి నాట్లు

- ఈ నెల చివరి వరకు వేయాలని సూచిస్తున్న వ్యవసాయ అధికారులు
- కరిగేట్లు, నాట్లు వేయడంలో అన్నదాతలు నిమగ్నం

మొయినాబాద్, ఆగస్టు 14 : వర్షాలు ఆశించిన విధంగా మొదట్లో కురువకపోవడంతో రైతులు ముందుగా నాట్లు వేయడంలో కొద్దిగా ఆలస్యం చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వరిపై కొంత ఆశలు పెట్టుకొని ఈ నెలలో వరి నాట్లు వేసే పనిని రైతులు పెట్టుకున్నారు. రైతులు తమ వద్ద ఉన్న కాడెద్దులతోపాటు కాడెద్దులు లేనివారు ట్రాక్టర్లను పెట్టి వరి కరిగేట్లను చేయిస్తున్నారు. ఈ నెల చివరి నాటికి వరి నాట్లు వేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. రైతులు ఇతర పంటల కంటే వరిపై ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారని అధికారులు పేర్కొంటున్నారు. వరి నాట్లు వేయడానికి ఈ ఏడాది సాధారణ విస్తీర్ణం 3889 ఎకరాలు ఉండగా.. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఈ నెల చివరి నాటికి 5500 ఎకరాల్లో వరి సాగు చేసే అవకాశముందని వ్యవసాయ మండల అధికారి రాగమ్మ తెలిపారు. గత ఏడాది 6000 ఎకరాల వరకు వరి సాగు చేశారు. వరి నాట్లు ఆగస్టు నెలలో కూడా వేస్తుండడంతో వరి సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టవలసి ఉంటుంది. చీడపీడలు కూడా అధికంగా ఆశించే అవకాశముంది కాబట్టి రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తమై వరి చేనును కాపాడుకోవాలి.

ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 14: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) ఎంఆర్ఐ, ఎల్‌డీ, హెచ్ఐ, ఏఎస్‌డీ కోర్సులతో పాటు పీజీడీసీఏ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

బీఈ పరీక్ష తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కం ట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ) అన్ని విభాగాల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, బీఈ (సీబీసీఎస్) అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, బీఈ (నాన్ సీబీసీఎస్) అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, వన్ టైం చాన్స్ పరీక్షలను ఈనెల 28 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో చూడవచ్చని తెలిపారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్లారెడ్డి రంగారెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికారు, ఉదయమే ఎమ్మెల్యేలతో పాటు పలువురు రంగారెడ్డి జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ చేరుకొని సీఎంకు స్వాగతం పలికారు. సీఎంకు స్వాగతం పలికినవారిలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రామిరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. - ఇబ్రహీంపట్నం/అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 14

జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ ప్రతీక్‌జైన్, పలు శాఖల ఉన్నతాధికారులు

వికారాబాద్, ఆగస్టు 14 : జ్వరాలపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జ్వరాలు, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలపై రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ శాంతికుమారి జిల్లా కలెక్టర్‌లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చికెన్‌గున్యా, డెంగ్యూ జ్వరాలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రెసిడెన్షియల్ స్కూల్స్, హాస్టళ్లను నిరంతరం సందర్శించాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, నాణ్యమైన భోజనం అందుతున్నాయా, లేదా అన్నది పర్యవేక్షించాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటూ ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని, విరివిగా మొక్కలు నాటాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైన చోట స్పెషల్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. రాపిడ్ కిడ్స్ అందుబాటులో ఉంచాలన్నారు. ఇంటింటి జ్వర సర్వే నిర్వహించి, పాజిటివ్ కేసులుంటే వెంటనే ట్రీట్‌మెంట్ ఇప్పించాలని తెలిపారు. నీటి నిల్వలను గుర్తించి దోమ లార్వాను నియంత్రించాలని పేర్కొన్నారు. ఆయిల్ బాల్స్ వేయాలని కలెక్టర్ అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

షాద్‌నగర్ ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

విద్యార్థులపై తిట్ల దండకం

- నిత్యం విద్యార్థులను వేధిస్తున్న కండక్టర్
- షాద్‌నగర్ ఆర్టీసీ డిపో ఎదుట విద్యార్థుల నిరసన

షాద్‌నగర్, ఆగస్టు 14 : ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాల్సిన ఆర్టీసీ బస్సు కండక్టర్ విద్యార్థులపై తిట్ల దండకానికి శ్రీకారం చుట్టాడు. నిత్యం బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తూ వేధింపులకు దిగాడు. గాడిదలను కాసేందుకు వెళ్తున్నారా? అంటూ నోరు పారేసుకుంటున్నాడు. బస్సు కండక్టర్ ప్రవర్తనతో విసిగిపోయిన విద్యార్థులు బుధవారం షాద్‌నగర్ ఆర్టీసీ డిపో ఎదుట నిరసనకు దిగి కండక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. షాద్‌నగర్ నుంచి కేశంపేట మండలం సంగెం మీదుగా ఉదయం, సాయంత్రం రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సు కండక్టర్ రాములు విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ ఇష్టానుసారంగా బూతులు మాట్లాడుతున్నారని విద్యార్థులు తీవ్రస్థాయిలో ఆరోపించారు. అధార్ కార్డు చూపే సమయంలో విద్యార్థినుల పట్ల ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ మార్గమధ్యంలోనే బస్సులో నుంచి దించేస్తున్నారని వాపోయారు. విద్యార్థులను ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్న కండక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కండక్టర్ రాములు పనితీరుపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు

హైదరాబాద్ టీ న్యాబ్ పోలీస్ సూపరింటెండెంట్(ఎస్పీ) సాయి చైతన్య

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ సాయి చైతన్య

చేవెళ్లటౌన్, ఆగస్టు 14 : విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని హైదరాబాద్ టీ న్యాబ్ పోలీస్ సూపరింటెండెంట్(ఎస్పీ) సాయి చైతన్య తెలిపారు. బుధవారం చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల ఆవరణలో తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో, పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన,. యాంటీ డ్రగ్ సోల్జర్ పేరిట కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్‌కు బానిసలు కావడం వల్ల జరిగే దుష్పరిణామాలపై షార్ట్ ఫిలింను విద్యార్థులు స్క్రీన్‌పై తిలకించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. డ్రగ్స్ దేశవ్యాప్త సమస్యగా మారిందని పేర్కొన్నారు. నార్కోటిక్స్ బ్యూరో లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా 11.5 కోట్ల మంది డ్రగ్స్ బానిసలయ్యారని తెలిపారు. మన రాష్ట్రంలోకి ఎటువంటి మాదక ద్రవ్యాలు సరఫరా కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. ఎన్నో ముఠాలను, సరఫరా దారులనును పట్టుకున్నామని.. దీంతో పాటు ప్రజల్లో అవగాహన రావడం ముఖ్యమన్నారు. భవిష్యత్తులో అన్ని ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కట్టడి కావాలంటే యువతలో అవగాహన రావడమే ముఖ్యమని వెల్లడించారు. మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగం నియంత్రణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందన్నారు. సమావేశంలో మెడికల్ డీన్ పీవీ సత్యనారాయణ, హాస్పిటల్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ జోయారాణి, టీ న్యాబ్ పోలీస్ డీఎస్పీ హరిశ్చంద్రారెడ్డి, సీఐలు శ్రీనివాస్ రావు, భూపాల్, శ్రీధర్, రమేశ్‌నాయుడు, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, అధ్యాపకులున్నారు.

కృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఏసీపీ అశోక్‌కుమార్‌ను కోరుతున్న రాంబల్‌నాయక్

బాలికపై లైంగిక దాడి ఘటనలో..

నిందితుడి అరెస్టు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 14 : గిరిజన మైనర్ బాలికపై లైంగికదాడి చేయడంతో పాటు సదరు బాలిక గర్భం తీయించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు తెలిపారు. శంషాబాద్ మండలం జూకల్ గ్రామానికి చెందిన మన్నే కృష్ణారెడ్డి పొలంలో కూలీ పనికి వెళ్లిన ఎర్రకుంట తండాకు చెందిన గిరిజన మైనర్ బాలిక(13)కు మాయమాటలు చెప్పి కొంతకాలం నుంచి లైంగిక దాడి చేయడంతో సదరు బాలిక గర్భం దాల్చింది. 5 నెలలు నిండిన తర్వాత విషయం తెలియడంతో సదరు వ్యక్తితోపాటు మరికొంత మంది కలిసి విషయం బయటపడకుండా ఉండడం కోసం బాలికను కొత్తూరులోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకుపోయి గర్భం తీయించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు దవాఖాన వైద్యుడితోపాటు లైంగికదాడికి పాల్పడిన కృష్ణారెడ్డి, అతడికి సహకరించిన వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

మైనర్ అబార్షన్ జరిగింది

కొత్తూరు శ్రీనివాస క్లినిక్‌లోనే..

కొత్తూరు : శంషాబాద్ మండల్ జూకల్ గ్రామ పరిధిలోని ఎర్రగుంటతండా మైనర్ బాలిక అబార్షన్ కొత్తూరులోనే జరిగింది. కొత్తూరుకు చెందిన శ్రీనివాస ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో డాక్టర్ రంజిత్‌కుమార్ ఈ అబార్షన్ చేశాడని శంషాబాద్ పోలీసులు నిర్ధారించారు. ప్రస్తుతం రంజిత్ కుమార్ పరారీలో ఉన్నట్లు సమాచారం. శ్రీనివాస ఫస్ట్ ఎయిడ్ సెంటర్ బోర్డును తొలగించి అతను పరారైనట్లు తెలుస్తున్నది. ఈ ఏడాది ఫిబ్రవరి 27న షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి శ్రీనివాస క్లినిక్‌కు నోటీసులు అందజేశారు. హోమియోపతి వైద్యం అనుమతులు తీసుకొని అలోపతి వైద్యం నిర్వహిస్తున్నాడని అతడికి నోటీసులిచ్చారు. అంతేకాకుండా మెడికల్‌షాప్‌ను కూడా రంజిత్‌కుమార్ నిర్వహిస్తున్నాడు. వేరే ఫార్మసిస్టును పెట్టుకోవాలని కూడా నోటీసులో పేర్కొన్నారు. అయినా ఇప్పటికీ మెడికల్ షాప్‌ను నడుపుతున్నాడు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి : ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్

షాద్‌నగర్ : శంషాబాద్ మండలం జూకల్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్రకుంటతండాకు చెందిన ఓ గిరిజన మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేసిన కాంగ్రెస్ నాయకుడు కృష్ణారెడ్డిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం శంషాబాద్‌లోని ఏసీపీ అశోక్‌కుమార్‌ను కలిసి జరిగిన ఘటనను వివరించి చర్యలు తీసుకోవాలని కోరారు. కూలీ పనులు చేసే అమాయక గిరిజన బాలికను బెదిరించి అత్యాచారానికి పాల్పడటం బాధాకరమన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏండ్లు గడిచినా దళితులు, గిరిజనులపై అత్యాచార దాడులు ఆగడంలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తూరులోని శ్రీనివాస క్లినిక్ డాక్టర్ రంజిత్‌రెడ్డితో బాలిక గర్భం తొలగించగా.. తీవ్ర అనారోగ్యానికి గురైందని పోలీసులకు తెలిపారు. అత్యాచారం చేసిన కృష్ణారెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు అబార్షన్ చేసిన రంజిత్‌రెడ్డిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఏసీపీని కోరారు.

పంద్రాగస్టు వేడుకల్లో 'ఒగ్గు డోలు'

బొంరాస్‌పేట, ఆగస్టు 14 : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్ గోల్కొండ కోటలో జెండావందనం తరువాత నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనకు బొంరాస్‌పేట మండలంలోని ఒగ్గు డోలు కళాకారులు ఎంపికయ్యారు. నాందార్‌పూర్‌కు చెందిన మల్లికార్జున ఒగ్గు కళా సమితికి చెందిన 20 మంది కళాకారులు బుధవారం హైదరాబాద్‌కు వెళ్లారు. తమకు అవకాశం కల్పించిన భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌కు కళాకారుడు బీరప్ప కృతజ్ఞతలు తెలిపారు.

రూ.25వేల ఆర్థిక సాయం

గత నెలలో లైంగిక దాడికి గురైన మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఏడేండ్ల చిన్నారికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు రూ. 25 వేలు ఆర్థిక సహాయం అందించారు. స్థాయి డైరెక్టర్ క్రాంతి వేస్లీ, డీడబ్ల్యూవోలు శ్రీనివాస్, కృష్ణవేణి బుధవారం నాగిరెడ్డిపల్లికి వెళ్లి తల్లిదండ్రులతో విచారణ చేశారు.

- బొంరాస్‌పేట, ఆగస్టు 14

పంద్రాగస్టుకు ముస్తాబైన కలెక్టరేట్

వికారాబాద్, ఆగస్టు 14 : 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని అధికారులు విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. వేడుకలకు ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం 10 గంటలకు ముఖ్య అతిథులచే జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుంది. చిన్నారుల నృత్య ప్రదర్శన, పోలీస్ పరేడ్, ఆయా శాఖల అధికారులు స్టాళ్లను ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో ఉచిత సాఫ్ట్‌వేర్ కోర్సుల శిక్షణ

కాచిగూడ, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా నిరుద్యోగులకు సాఫ్ట్‌వేర్ కోర్సులను ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ స్కిల్ అకాడమీ ప్రోగ్రామ్ కో -ఆర్డినేటర్ సాయి శ్రీమాన్‌రెడ్డి తెలిపారు. బుధవారం కాచిగూడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 100కు పైగా అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ కోర్సులు, ఆర్కిటెక్ట్, సెక్యూరిటీ విభాగం, డేటాసైన్స్, బిగ్‌డేటా, క్లౌడ్ కంప్యూటర్, జావా, ఓరాకిల్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ, విదేశాల్లో విస్తృతమైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని చెప్పారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ, చదివిన యువతీ యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9505800050/47, www.nationalskillacademy.inలో సంప్రదించవచ్చన్నారు

సైబర్‌నేరగాళ్ల ఖాతాల్లో రూ. 27 లక్షలు ఫ్రీజ్

సిటీబ్యూరో, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ట్రేడింగ్ పేరుతో సైబర్‌నేరగాళ్లు వేసిన వలలో చిక్కుకొని రూ.1.31,57,363 కోల్పోయిన బాధితుడి ఖాతాల్లోకి తిరిగి రూ.27 లక్షలు రప్పించినట్లు సైబర్‌క్రైమ్స్ డీసీపీ కవిత తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ బృందం వేగంగా ఆయా బ్యాంకులకు నోటీసులు జారీ చేశారని తెలిపారు. సైబర్ నేరగాళ్లకు చెందిన వివిధ ఖాతాల్లోని రూ.27 లక్షలు ఫ్రీజ్ చేశామన్నారు. ఆ డబ్బును తిరిగి రప్పించాలంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశామని, కోర్టు ఆదేశాల మేరకు ఫ్రీజ్ అయిన ఖాతాల నుంచి బాధితుడి ఖాతాకు రూ. 27 లక్షలు బదిలీ అయినట్టు తెలిపారు. సైబర్‌నేరం జరిగితే 1930కు కాల్ చేయాలని డీసీపీ సూచించారు.

సైబరాబాద్‌లో డ్రోన్‌లపై నిషేధం

సిటీబ్యూరో, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): భారత ఉప రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో సైబరాబాద్ పరిధిలోని పలు చోట్ల డ్రోన్ కెమెరాలను ఎగురవేయడంపై నిషేధం విధిస్తూ సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. ఉప రాష్ట్రపతి ఈ నెల 16న రానున్న నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా ఈ నెల 16 నుంచి 17 వరకు ఆర్‌జీఐ, శంషాబాద్, నందిగామ, కొత్తూరు పోలీసు స్టేషన్ల పరిధిలో రిమోట్‌తో ఆపరేట్ చేసే డ్రోన్‌లు, పారాగ్లైడర్స్, మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్స్ వంటి వాటిని ఎగురవేయడాన్ని నిషేధిస్తున్నట్లు సీపీ వెల్లడించారు. ఎవరైనా నిషేధిత రోజుల్లో డ్రోన్‌లను ఎగురవేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



శ్రీనివాస ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌కు నోటీసులిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి(ఫైల్)